
సాక్షి
కర్నూలు
శుక్రవారం | 28 | ఏప్రిల్ | 2023



శ్రీశైలంలో కేంద్ర మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను గురువారం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత సహాయ మంత్రి శృతిప్రతిమ భూమిక్ దర్శించుకున్నారు.



ఘనంగా గ్రామోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిలేశుని జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం యోగా నృసింహ గరుడ వాహనంపై కొలువుదీరిన ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.



గంగాదేవికి విశేష చూర్ణాభిషేకం

మహానంది: వైశాఖ శుద్ధసప్తమి సందర్భంగా మహానందిలో గురువారం గంగాదేవికి విశేష చూర్ణాభిషేకం నిర్వహించారు. రుద్రగుండం పుష్కరిణిలో భక్తులు పుష్కరస్నానం ఆచరించారు.

న్యూస్‌రీల్

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న డీఐజీ సెంథిల్ కుమార్

గోనెగండ్ల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపైనా అయినా చర్యలు తీసుకుంటామని డీఐజీ సెంథిల్ కుమార్ హెచ్చరించారు. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌ను గురువారం డీఐజీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళా పోలీసులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 2 సంవత్సరాల వ్యవధితో మంజూరు

కర్నూలు(సెంట్రల్): రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరుకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం కొత్తగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరు కొరకు జీవో 38 (తేదీ 30.3.2023) జారీ చేసిందన్నారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, పాస్ పోర్టు సైజ్ ఫొటో, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని సచివాలయం నుంచి వివిధ స్పందన అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రక్తహీనత నివారణ చర్యలను ముమ్మరం చేయాలన్నారు. గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవ్వాతాతలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అర్బన్ హెల్త్‌సెంటర్లలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో జరుగుతున్న డ్రాప్ ఔట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎస్ సూచించగా కర్నూలులో జిల్లాలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన వివరించారు.

వెరీ గుడ్డు



డెయిరీ ఫాంలో ఆవులు

20వ లైవ్‌స్టాక్ సెన్సెస్ ప్రకారం జిల్లాలో పశుసంపద వివరాలు..

తెల్లజాతి పశువులు	2,35,586
నల్ల జాతి పశువులు	1,26,784
గొర్రెలు	11,03,043
మేకలు	3,04,744
కోళ్లు	5,84,911
ఇతర పశువులు	20,005

- రికార్డు స్థాయిలో పెరిగిన గుడ్లు, మాంసం, పాలు ఉత్పత్తి
- జిల్లాలో 25 లక్షలకు పైగా పశుసంపద
- పెరుగుతున్న పొట్టేళ్ల పెంపకం
- విస్తరించిన కోళ్ల పరిశ్రమ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో గుడ్లు, మాంసం, పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. గతంలో బాయిలర్, గుడ్ల కోళ్లు ఎక్కువగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునేవారు. మూడేళ్లుగా జిల్లాలోనే బాయిలర్, గుడ్ల కోళ్ల పరిశ్రమ అభివృద్ధి చెందింది. గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల పెంపకాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. జీవాల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఏడాదికి రెండుసార్లు నట్టల నివారణ మందులు తాపిస్తోంది. శాస్త్రీయ పద్ధతిలో గొర్రెల పెంపకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన గొర్రెల పెంపకందారులకు ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. షెడ్యూలు ప్రకారం టీకాలు వేస్తూ పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో 25 లక్షలకు పైగా పశుసంపద

కర్నూలు జిల్లా పశుసంపదకు పెట్టింది పేరుగా గుర్తింపు పొందింది. జిల్లాలో 25 లక్షలకు పైగా పశుసంపద ఉంది. ఇందులో పునరుత్పత్తికి అవకాశం ఉన్న పశువులు 1,27,810 ఉన్నాయి. వీటి ఆధారంగా మాంసం, పాలు, గుడ్ల ఉత్పత్తిని లెక్కిస్తారు. నాటు పశువుల ద్వారా మేలు జాతి పశువుల ఉత్పత్తి చేసేందుకు కృత్రిమ గర్భధారణను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

110.22 శాతం పెరిగిన గుడ్ల ఉత్పత్తి

జిల్లాలో ఏడాదికేడాది గుడ్ల ఉత్పత్తి పెరుగుతోంది. 2021-22లో 11.85 కోట్ల ఉత్పత్తి ఉండగా.. 2022-23లో 11.97 కోట్ల లక్ష్యాన్ని ఇచ్చారు. అయితే లక్ష్యానికి మించి రికార్డు స్థాయిలో 14.31 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ ప్రకటించింది. కరోనా తర్వాత గుడ్ల వినియోగం గణనీయంగా పెరిగింది. రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు 85 శాతం ప్రజలు ఆహారంలో వీటిని తప్పనిసరి చేశారు. కరోనాకు ముందు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతాల నుంచి గుడ్లు ఎక్కువగా దిగుమతి చేసుకునేవారు. కరోనాకు ముందు జిల్లాలో 20 కోళ్ల పరిశ్రమలు ఉండగా నేడు అవి 50కి చేరాయి. కరోనాకు ముందు డిమాండ్‌లో 40 శాతం గుడ్లు మాత్రమే జిల్లాలో ఉత్పత్తి అయ్యేవి. నేడు 70 శాతం వరకు ఉత్పత్తి అవుతున్నాయి.



ఆదోనిలో పెంపకంలో ఉన్న పొట్టేళ్లు



51,911 టన్నుల మాంసం

జిల్లాలో గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల పెంపకం పెరుగుతోంది. 2022-23లో మాంసం 48,427 టన్నులు ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం కాగా.. 51,911.61 టన్నులు ఉత్పత్తి చేయడం విశేషం. మాంసం డిమాండ్‌కు అనుగుణంగా జీవాల పెంపకం పెరుగుతోంది. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆధునిక కబేళాలు కూడా ఏర్పాటవుతున్నాయి. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు పొట్టేళ్ల పెంపకం పెద్ద ఎత్తున చేపడుతున్నారు. వైఎస్సార్ చేయూత కింద గొర్రెల పెంపకం యూనిట్లు 8,500 గ్రౌండింగ్ అయ్యాయి. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ గొర్రెల పెంపకానికి పెద్దపీట వేస్తోంది.

పెరిగిన పాల ఉత్పత్తి

జిల్లాలో గుడ్లు, మాంసంతో పాటు పాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం కూడా పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నిరుద్యోగ యువత డెయిరీ ఫామ్‌లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధిలో రాణిస్తోంది. 2022-23లో 3,45,500 కిలో లీటర్ల(టన్నులు) ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. అయితే 3,70,013 కిలో లీటర్ల పాలు ఉత్పత్తి అయ్యాయి. 2021-22తో పోలిస్తే జిల్లాలో 32 వేల కిలో లీటర్ల పాల ఉత్పత్తి పెరిగింది. జిల్లాలో తెల్ల, నల్ల జాతి పశువులు 3.62 లక్షలు ఉండగా... ఇందులో పునరుత్పత్తి ఉన్న పశువులు 1.27 లక్షలు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 3,70,013 కిలో లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి.



జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం



జిల్లాలో పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయి. వీటి ఉత్పత్తి కోసం ప్రభుత్వం ఏటా లక్ష్యాలను ఇస్తోంది. 2022-23లో మాంసం, పాలు, గుడ్లు ఉత్పత్తిలో లక్ష్యాలను అధిగమించాం. జిల్లాలో ఏడాదికేడాది మాంసం ఉత్పత్తి పెరుగుతోంది. పెరటికోళ్లతో పాటు పొట్టేళ్లు, గొర్రెలు, మేకల పెంపకం అభివృద్ధి చెందుతోంది. జిల్లాలో 2022-23లో 110 శాతం గుడ్ల ఉత్పత్తి పెరిగింది. పాల ఉత్పత్తి కూడా పెరుగుతుండటం విశేషం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిలో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుతాం.

– డాక్టర్ రామచంద్రయ్య, జాయింట్‌డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన



భగీరథ మహర్షికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, బీసీ సంఘాల ప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): భగీరథ మహర్షి పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా భగీరథ మహర్షి చిత్ర పటానికి కలెక్టర్, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగేశ్వరరావు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జీడీ కళ్యాణి, సగర, ఉప్పర సంఘం నాయకులు హాజరై పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏదైనా లక్ష్య సాధన కోసం భగీరథ ప్రయత్నం చేయాలని పెద్దలు అంటుంటారని, అది భగీరథ మహర్షి చూపిన చలువేనన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా సగర సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గిడ్డయ్య, ఏపీ బీసీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీకాంతయ్య, డి.ఓబులేసు, డి.ధనుంజయాచారి తదితరులు పాల్గొన్నారు.

29న నవోదయ పరీక్ష

కర్నూలు సిటీ: 2023-24 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి తెలిపారు. గురువారం నవోదయ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లతో పాటు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఈఓ మాట్లాడుతూ పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 22 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7,767 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులు అర గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. సమావేశంలో నవోదయ విద్యాలయ(బనవాసి) ప్రిన్సిపల్ కె.సాగరిక, సీఎస్, డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చలువతోనే పులికనుమ ప్రాజెక్ట్

- లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పులికనుమ ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసి నిధులు కేటాయించారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తన నివాసంలో వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టు స్థిరీకరణ కోసం పులికనుమ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తానే స్వయంగా వైఎస్సార్‌కు విన్నవించగా అందుకు సమ్మతించి ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇచ్చారన్నారు. రూ.240 కోట్ల నిధులు మంజూరు చేసి, 95 శాతం పనులు పూర్తి చేశారన్నారు. టీడీపీ హయాంలో రూ.20 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ప్రాజెక్ట్ నుంచి ఎల్లెల్సీకి అప్రోచ్ కాలువలు తవ్వారన్నారు. పులికనుమ ప్రాజెక్ట్‌ను టీడీపీ చేపట్టిందని నారా లోకేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు తప్పుడు మాటలతో మరో 10 సార్లు నారా లోకేష్ పాదయాత్ర చేసినా టీడీపీ అధికారంలోకి రాదన్నారు. గోనెగండ్ల మండలంలోని తిప్పనూరు బ్రిడ్జికి తాను రూ.9కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తే.. టీడీపీ హయాంలో దాన్ని ప్రారంభించిందన్నారు. అదికూడా తామే చేశామని చెప్పుకొనే దుస్థితిలో నారా లోకేష్ ఉన్నారన్నారు. ఆర్డీఎస్ కుడి కాలువకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వమే అంకురార్పణ చేసిందని, నాగలదిన్నె బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించిందని, లోకేష్..వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి మంచినీటి పంపింగ్, పైప్ లైన్ల కోసం టీడీపీ హయాంలో కమీషన్లు దండుకొని కేవలం అనుమతులిచ్చాని, నిధులు కేటాయించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకానికి రూ.142 కోట్లు మంజూరు చేయడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభిస్తే అది కూడా తామే చేస్తున్నామని లోకేష్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రూ.60కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంపుతో 5టీఎంసీల నీరు నిల్వ ఉంచేందుకు అవకాశం ఉందన్నారు.

ఏపీ ఈఆర్‌సీ కార్యాలయ భవనం కోసం అన్వేషణ

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలైంది. కార్యాలయ ఏర్పాటుకు 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం కావాలని దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ అధికారులను కోరారు. ఈ మేరకు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతికి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆయన కింది స్థాయి సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో చర్చించి భవనం అన్వేషణలో ఉన్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినా ఇప్పటి వరకు ఏపీ ఈఆర్‌సీ (విద్యుత్ నియంత్రణ మండలి) కార్యాలయం హైదరాబాదులోనే ఉంది. ఆ కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ జీఓ ఎంఎస్ నంబర్-8ని విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు పలు ప్రాంతాల్లో భవనం పరిశీలించే పనిలో ఉన్నారు. భవనంతో పాటు అందుకు తగ్గట్లు పార్కింగ్, అధికారులు, ఉద్యోగులు, వినియోగదారులు వచ్చి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉండాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు భవనం నిర్మించుకునేందుకు ఒక ఎకరం భూమి కావాలని కోరినట్లు సమాచారం.

ఉపాధి కల్పించకపోతే జీతాల నిలుపుదల

ఎంపీడీఓలు, ఏపీడీలను హెచ్చరించిన కలెక్టర్

- 12 మండలాల్లో 50శాతంలోపే పనుల కల్పనపై ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంపీడీఓలు, ఏపీడీల జీతాలను నిలుపుదల చేయిస్తానని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి కూలీల హాజరుశాతం 95 శాతానికి పెంచకపోతే ఉద్యోగాల నుంచి తప్పిస్తానన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన డ్వామా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 12 మండలాల్లో 50 శాతానికి మంచి ఉపాధి పనులు కల్పించలేదన్నారు. హాలహర్వి 24, నవందవరం 35.89, చిప్పగిరిలో 37.17 శాతం మేరకే పనులు కల్పించడం ఏమిటని ఎంపీడీఓలు, ఏపీడీలను ప్రశ్నించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు వెల్దుర్తి, ఎమ్మిగనూరు, సీబెళగల్ మండలాల్లో 70 శాతం లోపే ఉండడంతో వచ్చే వారంలోపు 95 శాతం కంటే తక్కువ అటెండెన్స్ నమోదయితే ఎంపీడీఓలు, ఏపీడీల జీతాలను నిలుపుదల చేయిస్తానని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలకు లక్ష్యం మేరకు జాబ్ కార్డులను జారీ చేయాలన్నారు. అమృత్ సరోవర్‌కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 24 పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, డీపీఓ నాగరాజునాయుడును, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇంకా కలెక్టర్ ఏమన్నారంటే..

- జగనన్నతోడుకు సంబంధించి పెండింగ్‌లోని 11వేల దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపాలని డీఆర్‌డీఏ, మెప్మా పీడీలను ఆదేశించారు.
- మహిళా మార్టుల్లో మిల్లెట్ స్నాక్స్ విక్రయానికి చర్యలు తీసుకోవాలన్నారు.
- కర్నూలులో వాకింగ్ ట్రాక్‌ల వెంట పొదుపు మహిళలతో మిల్లెట్ కేఫ్‌లను ఏర్పాటు చేయాలన్నారు.
- ఆదోని ఏరియాలో జీన్స్ క్లస్టర్ ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ కింద కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.
- ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి నీటి రవాణా చేస్తున్న గ్రామాల వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని, గ్రీన్‌కో ద్వారా స్పాన్సర్ చేయిస్తానని కలెక్టర్ ఎస్ఈ నాగేశ్వరరావుకు సూచించారు.

కోడుమూరుకు 'శాశ్వత' వరం

- శాశ్వత తాగునీటి పథకం కోసం రూ.30 కోట్ల మంజూరు
- హామీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఇలాంటి కష్టాలు తప్పినట్లే.. నీటి కోసం ట్యాంకర్ దగ్గర కోడుమూరు ప్రజలు

కోడుమూరు: దీర్ఘకాలిక సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపింది. ముప్పయి వేల జనాభా కలిగిన కోడుమూరు పట్టణానికి శాశ్వత తాగునీటి పథకం కోసం రూ.30 కోట్లను మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో కోడుమూరు పట్టణానికి మినరల్ వాటర్‌ను అందజేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపగా ఇటీవలే రాష్ట్రప్రభుత్వం కోడుమూరులో మినరల్ వాటర్ ప్లాంటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ప్రాంత ప్ర'జల' ఇబ్బందులు తొలగనున్నాయి.

తాగునీటి పథకం ఏర్పాటు ఇలా..

కోడుమూరు, వెంకటగిరి, ప్యాలకుర్తి, రామచంద్రాపురం, వర్కూరు, చనుగొండ్ల గ్రామాలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసేందుకు ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర పంపుహౌసును నిర్మిస్తారు. అక్కడి నుంచి 22 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి కోడుమూరు పట్టణంలోని కొండ దగ్గర కింది భాగంలో 5.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును నిర్మిస్తారు. ర్యాపిడ్ ఫిల్టర్ బెడ్స్‌తో శుద్ధి చేసిన మినరల్‌వాటర్‌ను కోడుమూరు, వెంకటగిరి, ప్యాలకుర్తి, రామచంద్రాపురం, వర్కూర్, చనుగొండ్ల గ్రామాలకు సరఫరా చేయనున్నారు. ఏడాదికి 0.01 టీఎంసీ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వాడుకునే విధంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆరు నెలల కాలంలో పనులను పూర్తి చేసి తాగునీటిని అందించాలని అధికారులు టెండర్లను పిలిచారు. ఈ పథకం పూర్తయితే కోడుమూరు నియోజకవర్గంతో పాటు ఐదు గ్రామాల పరిధిలోని 50 వేల జనాభాకు తాగునీటి సమస్య పూర్తిగా తొలగనుంది.

అభివృద్ధికి ప్రాధాన్యత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోడుమూరు నియోజవర్గంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేసింది. దశాబ్దాలుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపింది. 2013లో అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పాదయాత్రలో నడుచుకుంటూ వస్తూ గూడూరు నుంచి సుంకేసుల వరకు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఈ హామీని పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలోపు గూడూరు నుంచి సుంకేసుల వరకు రూ.6.50 కోట్ల వ్యయంతో రోడ్డును నిర్మించారు. కృష్ణగిరి, కోడుమూరు మండలాల పరిధిలో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు గోరంట్ల దగ్గర హంద్రీనదిపై బ్రిడ్జిని నిర్మించేందుకు రూ.24 కోట్లు మంజూరు చేయడంతో ఆ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కోడుమూరు పట్టణంలో దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోడుమూరు నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



కోడుమూరుతో పాటు మరో ఐదు గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. నాలుగేళ్ల కాలంగా కోడుమూరు నియోజకవర్గంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.

– జె. సుధాకర్, ఎమ్మెల్యే, కోడుమూరు

అభినందనీయం



కోడుమూరు పట్టణంలో ఎండాకాలం వచ్చిందంటే ప్రజలు తాగునీటి కోసం నరకయాతన అనుభవించేవారు. ప్రజలను వెంటబెట్టుకుని మేం రోడ్డు ఎక్కి ఆందోళన చేసేవాళ్లం. ప్రభుత్వం తాగునీటి పథకం ఏర్పాటు చేసేందుకు నిధులను మంజూరు చేయడం అభినందనీయం. ఇక తాగునీటి కోసం పోరాడాల్సిన అవసరం లేదు.

– బి.క్రిష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

చాలా సంతోషం



కోడుమూరు పట్టణంలో తాగునీటి కోసం రోజూ అవస్థ పడాల్సిందే. కుళాయి నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలీదు. ఎండకాలంలో అర్ధరాత్రి వరకు జాగరణ చేసేవాళ్లం. మా కష్టాలు తొలగిపోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– భారతి, కోడుమూరు

లోకోస్ ఆపరేటింగ్‌తో ఎస్‌హెచ్‌జీల నిర్వహణ

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు మరింత పారదర్శకంగా ఉండేందుకు కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా లోకోస్ ఆపరేటింగ్ సిస్టమ్ అమలు చేస్తోందని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ సంయుక్తంగా గూగుల్ మీట్ ద్వారా జిల్లా డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కర్నూలు శివారులోని టీటీడీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలన్నింటినీ మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా నిర్వహిస్తున్నామని, ఇకపై ఇంతకంటే ఆధునాతనంగా రూపొందించిన లోకోస్ అపరేటింగ్ సిస్టమ్‌ను కొనసాగించాలన్నారు. ప్రతి సంఘానికి ఎన్ఆర్ఎల్ఎం ఐడీ వస్తుందని, దీని ద్వారా దేశంలో ఎక్కడినుంచైన సంఘం నిర్వహణను తెలుసుకోవచ్చన్నారు. సమావేశంలో డీపీఎంలు రెహ్మాన్, అయ్యన్న, ఏపీఎం ప్రభావతి, ఏసీలు నవీన్, శ్రీనివాసులు, జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్): భూసార పరీక్షలకు వ్యవసాయ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నంద్యాల జిల్లాకు సంబంధించిన మట్టి నమూనాలను కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షిస్తారు. కర్నూలు జిల్లాకు సంబంధించిన మట్టి నమూనాలకు ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తారు. నంద్యాల జిల్లా నుంచి 822 శాంపుల్స్ రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 474 చేరాయి. ఏఓ ఇందువతి ఆధ్వర్యంలో మట్టి నమూనాల పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో ఒకటి, రెండు రోజుల్లో పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- పెద్దచెరువులో నీట మునిగి ఇద్దరు మృతి
- మృతులిద్దరూ బావ,బామర్దులు

బొమ్మలసత్రం: ఈత సరదా రెండు ప్రాణాలను బలితీసుకుంది. పని మీద బయటకు వెళ్లిన ఇద్దరూ వ్యక్తులు విగతజీవులుగా తిరిగొచ్చారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని పెద్దచెరువులో నీట మునిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. తాలుకా ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న చంద్రశేఖర్, శివలింగమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. చిన్నవాడైన హరికృష్ణ (27)కు రెండేళ్ల క్రితం గిద్దలూరుకు చెందిన యువతితో వివాహం చేశారు. వీరికి ఆరు నెలల బాలుడు ఉన్నాడు. సొంతంగా బొలేరొ క్యాంపర్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వాహనం రిపేరి కావటంతో బుధవారం ఆటోనగర్‌కు వెళ్లాడు. అలాగే తన మేనత్త చిన్న కుమారుడు మహేష్‌బాబు(16) కూడా వెంట వెళ్లాడు. అయితే రాత్రి ఎంతసేపటికీ ఇద్దరు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారి సెల్‌ఫోన్లకు కాల్ చేశారు. అయితే వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందారు. రాత్రి మొత్తం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం చెరువు కట్ట మీద వాహనం ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని పరిశీలించగా అందులో దుస్తులు, సెల్‌ఫోన్‌లు, పర్సులు ఉండటంతో చెరువులో దిగి నీటిలో గల్లంతై ఉంటారని అనుమానించారు. ఈ మేరకు ఫైర్ సిబ్బంది సహకారంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఇద్దరు మృతదేహాలు నీటిపై తేలడంతో బయటకు తీశారు. వాహనం రిపేరి చేయించిన అనంతరం ఇద్దరు కలిసి ఎస్‌బీఐ కాలనీలో ఉన్న పెద్దచెరువు వద్దకు స్నానం చేసేందుకు వెళ్లి లోతు ఎక్కువగా ఉండటంతో నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మహేష్‌బాబు ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో హరికృష్ణతో పాటు వాహనంలో తిరుగుతున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చేతికొచ్చిన కుమారుడు నీటిలో శవమై తేలడంతో తల్లి నాగమణి కన్నీరుమున్నీగా విలపిస్తోంది. మహేష్‌బాబు తండ్రి బుగ్గన్న గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన మహేష్‌బాబు, హరికృష్ణ (ఫైల్)

బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



వేణుగోపాల్(ఫైల్)

గోనెగండ్ల: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. పెద్దనేలటూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి శ్రీరాములు, సువర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వీరు తమ పెద్దకుమారుడు వేణుగోపాల్(17)ను గోనెగండ్ల జూనియర్ కళాశాలలో ఇటీవలే ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. గురువారం స్నేహితులు ఐదుగురితో కలిసి వేణుగోపాల్ సరదాగా ఊరి చివరలోని బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోవడంతో తోటి స్నేహితులు కేకలు వేశారు. సమీపంలో ఉన్న వారు వచ్చి బావిలో వెతికి కొద్దిసేపటికి నీటిలోంచి వేణును బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

వైఎస్‌ఆర్ జలకళ బోర్లపై సామాజిక తనిఖీలు



జలకళ బోరును పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ జలకళ బోర్ల తవ్వకం పారదర్శకంగా ఉండాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధి శాఖ సోషల్ ఆడిట్ నిర్వహిస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సోషల్ ఆడిట్ టీమ్‌లు ప్రతి బోరును క్షుణంగా పరిశీలిస్తున్నాయి. రెండు జిల్లాలో 14 మంది సామాజిక తనిఖీల్లో నిమగ్నమయ్యారు. 2021 జూలై నుంచి 2022 జూన్ వరకు వేసిన ప్రతి బోరును సోషల్ ఆడిట్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 640 బోర్లు, నంద్యాల జిల్లాలో 535 బోర్లు వేశారు. సోషల్ ఆడిట్ సిబ్బంది రైతుల సమక్షంలో బోరును పరిశీలిస్తున్నారు. ఎంబుక్ ప్రకారం కొలతలు ఉన్నా యా? కేసింగ్ పైపు ఎన్ని అడుగులు వేశారు? తదితర వివరాలు తెలుసుకుంటున్నారు.

పెయింట్స్ డీలర్‌షిప్ పేరుతో మోసం

- ఎమ్మిగనూరు వాసికి సైబర్ నేరగాడి బురిడీ
- నమ్మించి రూ. 7.25 లక్షలు దోచుకున్న వైనం
- పట్టణ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ఎమ్మిగనూరు రూరల్: ప్రముఖ కంపెనీ పేరుతో ఆన్‌లైన్‌లో వస్తున్న వ్యాపార ప్రకటనలు చూసి ఎమ్మిగనూరుకు చెందిన ఓ వ్యక్తి మోసపోయాడు. జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ డీలర్‌షిప్ పొందేందుకు ఆన్‌లైన్‌లో ప్రయత్నిస్తూ సైబర్ నేరగాడి వలలో పడి రూ. 7.25 లక్షలు పోగొట్టుకున్నాడు. పట్టణంలో ఎస్‌ఎంటీ కాలనీ సమీపంలో చీరల వ్యాపారం చేసే టీకె.సుధీర్‌కుమార్ జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ డీలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో నకిలీ వెబ్‌సైట్‌ను సంప్రదించాడు. అప్పటి నుంచి సైబర్ నేరగాడు విడతల వారీగా డబ్బు వసూలు చేశాడు. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు కోసం రూ. 24,999, ఆ తర్వాత డిపాజిట్ కోసం రూ. 2 లక్షలు బాధితుడు కట్టాడు. అనంతరం మరో రెండు రోజుల తర్వాత సుధీర్‌కుమార్‌కు సైబర్ నేరగాడు ఫోన్ చేసి పెయింట్ స్టాక్ కోసం రూ. 5 లక్షలు పంపాలని చెప్పడంతో ఎమ్మిగనూరుకు వచ్చి షాప్ చూసి వెళ్తే బాగుంటుందని బాధితుడు కోరాడు. అయితే తమ హెడ్ ఆఫీస్ ముంబాయిలో ఉందని, అక్కడి నుంచి రావడం కుదరదని చెప్పడంతో ఈనెల 17వ తేదీన సుధీర్‌కుమార్ రూ. 5 లక్షలు జమ చేశాడు. డబ్బులు పంపిన వెంటనే స్టాక్ ఇన్వాయిస్ పంపి ఇంకా బ్యాలెన్స్ రూ. 4 లక్షలు పంపాలని చెప్పడటంతో అనుమానం వచ్చింది. 'అంత డబ్బు చెల్లించలేను.. డీలర్ షిప్ రద్దు చేసుకుంటాను.. ఇప్పటి వరకు చెల్లించిన రూ. 7,24,999లు వెనక్కి పంపండి' అంటూ బాధితుడు కోరాడు. అయితే డబ్బు రీఫండ్ కాదని, మిగతా బ్యాలెన్స్ రూ. 4 లక్షలు చెల్లిస్తేనే పెయింట్ స్టాక్ పంపుతామని సైబర్ నేరగాడు భయపెట్టాడు. దీంతో తాను మోసపోయినట్లు తెలుసుకొని బాధితుడు సుధీర్‌కుమార్ జేఎస్‌డబ్ల్యూ టోల్ ఫ్రీ నెంబర్ 18001204944కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పగా, జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ పేరున ఉన్న వెబ్‌సైట్ నకిలీదిగా తేలింది. బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మధుసూదన్‌రావు గురువారం చెప్పారు. ఆన్‌లైన్ వ్యాపార ప్రకటనలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

టూరిజం ప్రాజెక్టులకు పోటాపోటీగా వేలం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ దేవస్థానాలు, పర్యాటక ప్రాంతాల్లో నిర్మించిన టూరిజం ప్రాజెక్టులను పదేళ్ల కాలపరిమితిలో లీజుకు ఇచ్చేందుకు గురువారం కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. జిల్లా టూరిజం అధికారి విజయ, డీఈఓ రంగారెడ్డి, సెట్కూరు సీఈఓ రమణ, జిల్లా కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ట్రావెల్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావులతో కూడిన కమిటీ వేలంపాట నిర్వహించింది.

- లక్ష్మి జగన్నాథగట్టు(లక్ష్మిపురం) వద్ద నిర్మించిన డార్మిటరీ బ్లాక్, పార్క్, కెఫిటేరియా, సెక్యూరిటీ గార్డ్ రూమ్, ప్రవేశ రుసుము వసూలు నిర్వహించిన వేలంపాటకు డిమాండ్ ఏర్పడింది. 12 మంది వేలం పాటలో పాల్గొన్నారు. ప్రభుత్వ రేటు రూ.88 వేలు ఉండగా వేలంపాటలో మధుసూదన్ అనే వ్యక్తి రూ.7 లక్షలకు దక్కించుకున్నారు.
- ఓర్వకల్ మండలం కేతవరం రాతిచిత్రాల వద్ద నిర్మించిన టూరిజం రెస్టారెంటు వేలం పాటకు కేవలం ఇద్దరు మాత్రమే పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు రూ.1.03 లక్షలు ఉండగా.. అదే రేటుకు కర్నూలుకు చెందిన శ్రీలక్ష్మి అనే మహిళ దక్కించుకున్నారు. ఇది ఏడాదికి చెల్లించాల్సిన బాడుగ. మూడేళ్లకు ఒకసారి 10 శాతం పెంచుతారు.
- వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం దేవాలయం బస్టాపు వద్ద నిర్మించిన టూరిజం డార్మిటరీ, కాల్వబుగ్గ దేవాలయం బస్టాపు వద్ద నిర్మించిన ఏపీ టూరిజం రెస్టారెంట్‌లకు వేలంపాటలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వీటిపై కలెక్టర్ సృజనతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని జిల్లా టూరిజం అథారిటీ అధికారి విజయ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కోమటి జయమ్మ(ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కోమటి జయమ్మ(116) గురువారం ఉదయం మృతిచెందారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందగా ఈమె గ్రామంలో కిరాణం షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈమెకు కుమారుడు వీరస్వామి, కుమార్తె ఉన్నారు. తన జీవిత కాలంలో నాలుగు తరాల వారిని ఈమె చూశారు. జయమ్మకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, వృద్ధాప్యం కారణంగానే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. శతాధిక వృద్ధురాలికి గ్రామస్తులు నివాళి అర్పించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ఎస్‌ఆర్ కాలేజ్

కర్నూలు(సిటీ): ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజీ జోనల్ ఇన్‌చార్జి టి.రఘువీర్ తెలిపారు. గురువారం నగర శివారులోని బి.తాండ్రపాడు దగ్గర ఉన్న ఆ కాలేజీలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ ఎంపీసీ విభాగంలో ఆర్.కార్తీక్ పవన్ 987, ఆర్.ఉదయ్ కుమార్ రెడ్డి 985, పి.లక్ష్మీకాంత్ 981, ఎస్.మానిటేశ్వరి 976, బైపీసీ విభాగంలో చిత్రాల చరిత 979, శ్యాయిస్తన్యాజ్ 979, పి.విజయానంద్ 974 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో వై.మినిత్ కుమార్ 462, ఎస్.భద్రినాథ్ రెడ్డి 462, పి.నేహా విరోనికారెడ్డి 461, పుశ్యంత్ 461, పులిపాటి మానస 460, బైపీసీ విభాగంలో ఎం.కీర్తి 432, జె.సాయిసుమన 430, పి.మానస 428, ఎస్.తేజేశ్వర్ 420 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యా సంస్థల వ్యవస్థాపకులు ఎ.వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, ఏజీఎం రాజేంద్రప్రసాద్‌లు అభినందించారు.



విద్యార్థులతో ఎస్‌ఆర్ కాలేజీ జోనల్ ఇన్‌చార్జ్ రఘువీర్

ఆరోగ్య బీమాలో 24 గంటల నిబంధన సరికాదు

- వైద్యఖర్చులు చెల్లించాలని 'వినియోగదారుల' కమిషన్ ఆదేశం

కర్నూలు(లీగల్): ఆరోగ్య బీమా (మెడీక్లెయిమ్ పాలసీ) ఉన్నవారు వైద్య చికిత్సలకు సంబంధించిన బిల్లులు పొందాలంటే 24 గంటలు తప్పనిసరిగా ఆసుపత్రిలో ఉండాలన్న నిబంధన సరికాదని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ స్పష్టం చేసింది. ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో ఇటువంటి నిబంధన విధించడం సరికాదని తేల్చి చెప్పింది. కొన్ని గంటల పాటు మాత్రమే ఆసుపత్రిలో ఉన్నారని, 24 గంటలు ఆసుపత్రిలో చికిత్స పొందలేదన్న కారణంగా బిల్లులు చెల్లించమన్న బీమా సంస్థ తీరును తప్పుబట్టింది. చికిత్సకు అయిన మొత్తాన్ని 9 శాతం వడ్డీతో చెల్లించాలని బీమా సంస్థను ఆదేశించింది. అలాగే పరిహారంగా రూ.10 వేలు, కోర్టు ఖర్చులకు మరో రూ.2 వేలు చెల్లించాలని తీర్పులో స్పష్టం చేసింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే... ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు బ్యాంకు యాజమాన్యం గ్రూప్ ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంది. ఈ క్రమంలో బ్యాంకు ఉద్యోగి ఎస్.తొలిశమ్మ క్యాన్సర్ చికిత్సలో భాగంగా 2019 జులై 3న యశోద ఆసుపత్రిలో చేరి కీమోథెరపీ చికిత్స తీసుకుని అదే రోజు కొన్ని గంటల తర్వాత డిశ్చార్జి అయ్యారు. కీమో థెరపీ చికిత్సకు అయిన దాదాపు రూ.1.72 లక్షలను ఇప్పించాలని కోరుతూ బీమా కంపెనీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎటువంటి కారణాలు చూపకుండానే తొలిశమ్మ అభ్యర్థనను బీమా కంపెనీ తిరస్కరించిందని, చికిత్సకు అయిన ఖర్చులను వడ్డీతో సహా ఇప్పించాలని న్యాయవాది శివసుదర్శన్ వాదనలు వినిపించారు. 24 గంటలు ఆసుపత్రిలో చికిత్స పొందడం పాలసీ నిబంధనల ప్రకారం తప్పనిసరి అని బీమా కంపెనీ తరపున న్యాయవాది కూసుపాటి మురళీధర్ వాదనలు వినిపించారు. ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా 24 గంటలు తప్పనిసరిగా ఆసుపత్రిలో చికిత్స పొందాలని నిబంధనలు విధించడం సరికాదు అని బెంచ్ స్పష్టం చేసింది. వైద్యానికి అయిన ఖర్చును 9 శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

జొన్నగిరిలో రూ.127 కోట్ల ఏపీజీబీ లావాదేవీలు

- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

తుగ్గలి: రాష్ట్రంలోని పది జిల్లాల్లో 552 బ్రాంచ్‌లతో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) విస్తరించి ఉందని, రూ.43,560 కోట్లతో లావాదేవీలు జరుగుతున్నాయని ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్‌కశ్యప్ తెలిపారు. జొన్నగిరి శాఖలో రూ.127 కోట్ల లావాదేవీలు జరగడం అభినందనీయమన్నారు. గురువారం జొన్నగిరిలో నూతన భవనంలోకి బ్యాంక్ కార్యాలయాన్ని మార్పు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే ఏపీజీబీ అధిక వడ్డీ ఇస్తోందన్నారు. పంట రుణాలతోపాటు పాడుపు, హౌసింగ్, వాహన, వ్యాపార తదితర అన్ని రకాల రుణాలు ఇస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లకు బ్యాంకు గ్యారంటీ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. బ్యాంకు మేనేజర్ కేసీ లోకేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ రమణ, హెడ్ ఆఫీస్ అధికారి రవిమోహన్, బ్యాంకు సిబ్బంది, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్‌కశ్యప్

మహనీయుడు అంబేడ్కర్

వెల్దుర్తి: సమాజంలో అసమానతలను తొలగించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, డాక్టర్ సుధాకర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు అన్నారు. ఎస్ బోయనపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అశోక్‌రెడ్డి, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ, గ్రామ అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాదాపు 8 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో ఎస్సీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ అంబేడ్కర్ నిజమైన దేశభక్తుడని, దేశంలోని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అవకాశం కల్పించిన మహనీయుడన్నారు. దేశ ప్రజల స్వేచ్ఛ, సమానత్వం కోసం త్యాగాలు చేయాల్సిందేనని చెప్పిన ఆదర్శప్రాయుడన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. దళితులు, అణగారిన వర్గాలు తమ హక్కుల కోసం నిలదీసి పోరాడాలన్నారు. ఏపీ మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకరావు మాట్లాడుతూ చరిత్రను తిరగరాసిన మహనీయుడు అంబేడ్కరన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, మాల యువత రాష్ట్ర అధ్యక్షుడు యాట ఓబులేసు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు, ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేడ్కర్ మహోన్నత వ్యక్తిత్వాన్ని, ఆయన సేవలు, త్యాగాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, తహసీల్దార్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సచివా లయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, సీఐ యుగంధర్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఎరుకలి రాజు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్ముర్తి కనకరావు తదితరులు

ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసిన ఇన్విజిలేటర్

- ఎంబీబీఎస్ పరీక్షల విధుల నుంచి తప్పించిన అబ్జర్వర్

కర్నూలు(హాస్పిటల్): ఎంబీబీఎస్ సప్లిమెంటరీ పరీక్షల ప్రశ్నపత్రాన్ని ఓ ఇన్విజిలేటర్ తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీశాడు. ఈ విషయాన్ని పరీక్షల అబ్జర్వర్ గుర్తించి వెంటనే సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, ఆయన్ను విధుల నుంచి తప్పించారు. కర్నూలు మెడికల్ కళాశాల కేంద్రంలో ఎంబీబీఎస్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్‌గా ఉన్న మైక్రో బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చక్రపాణి యాదవ్ గురువారం తన సెల్‌ఫోన్‌ను పరీక్ష హాలులోకి తీసుకువెళ్లాడు. పరీక్ష ప్రారంభమయ్యాక ఆయన ఫోన్‌ను బయట పెట్టేందుకు వస్తుండగా, అబ్జర్వర్ డాక్టర్ శ్రీనివాస నాయక్ ఫొటో తీసినట్లు గుర్తించి ప్రశ్నించారు. వెంటనే ఆయన్ను పరీక్షల విధుల నుంచి తప్పించారు. విషయాన్ని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, డీఎంఈ, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ల దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు.